
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు

శనివారం 27 జనవరి 2024

జిల్లా వార్తలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా

గిరిజనాభివృద్ధికి చర్యలు

1,70, 835 మందికి రైతు భరోసా-పీఎం కిసాన్ సాయం

- రెండు లక్షల 80 వేల ఎకరాలకు సాగు హక్కు పత్రాలు
- సమాచార వ్యవస్థ అభివృద్ధికి కొత్తగా 2,038 సెల్ టవర్లు
- పీఎం జన్‌మన్ పథకం కింద 24,154 పీవీటీజీ కుటుంబాలకు పక్కా ఇళ్లు
- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్
- పాడేరులో ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు

పాడేరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన 75వ గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు సముచిత ప్రాధాన్యం ఇస్తున్నామని, 'మన బడి నాడు-నేడు' కార్యక్రమం రెండో విడతలో 947 పాఠశాలలు, 124 అంగన్‌వాడీల కేంద్రాలు, 12 జూనియర్ కాలేజీలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద లక్షా 70 వేల 835 మంది రైతులకు రూ.153 కోట్లను పెట్టుబడి సాయంగా అందించామని, పలువురు రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేశామని కలెక్టర్ చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తున్నామన్నారు. అటవీ హక్కుల చట్టంలో భాగంగా పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో లక్షా 42 వేల కుటుంబాలకు రెండు లక్షల 80 వేల ఎకరాల సాగుభూమికి హక్కు పత్రాలను అందించామని, ఆయా భూముల్లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహిస్తున్నామన్నారు.

జిల్లాలో 352 గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల దగ్గరకు తీసుకువచ్చామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు గుర్తించిన 2,034 పనులకు రూ.68 కోట్లు మంజూరయ్యాయన్నారు. సమాచార వ్యవస్థను మెరుగుపర్చడంలో భాగంగా ఏజెన్సీలో 2,038 సెల్ టవర్ల ఏర్పాటు ప్రక్రియ జరుగుతున్నదని, మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లాలో 1,29,285 మందికి సామాజిక పింఛన్ల కింద ప్రతి నెల రూ.39 కోట్లు అందజేస్తున్నామని చెప్పారు.

గంజాయి సాగు నిర్మూలనకు ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా పోలీసు యంత్రాంగం 346 ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేశారని, ఆయా భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా పలురకాల యూనిట్ల ఏర్పాటుకు



కొయ్యూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మల్లకంబ విన్యాసం

రాయితీలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందరికీ ఇళ్లు కార్యక్రమంలో జిల్లాలో 17,118 కుటుంబాలకు పక్కాఇళ్లను మంజూరు చేశామన్నారు.

ఆసరా పథకం కింద జిల్లాలో 85 వేల మందికి రూ.104 కోట్ల లబ్ధి చేకూరగా, 12,818 స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ కింద రూ.19.26 కోట్లు అందించామన్నారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా తాగునీటిని



ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

అందించేందుకు రూ.630 కోట్లతో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పీఎం జన్‌మన్ పథకం కింద జిల్లాలో 24,154 ఆదిమ జాతి కుటుంబాలకు పక్కా ఇళ్లు మంజూరయ్యాయన్నారు.

ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా పథకం కింద జిల్లాలో 2,896 స్వయం సహాయక సంఘాలకు రూ.130.44 కోట్ల నమూనా చెక్కును మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా, అడిషనల్ ఎస్పీ పి.అనిల్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కె.కార్తిక్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



ప్రథమ బహుమతికి ఎంపికైన వ్యవసాయ శాఖ శకటం

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. తలారిసింగి ఆశ్రమ పాఠశాల బాలురు, శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాల బాలికలు, టీడబ్ల్యూ ఇంగ్లీషు మీడియం గురుకుల పాఠశాల, కేజీబీవీ బాలికలు, సెంటాన్స్ విద్యార్థులు, లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాల బాలురు, భారతీయ విద్యా కేంద్రం విద్యార్థులు దేశభక్తి గీతాలతో నృత్య ప్రదర్శనలు చేశారు. భారతీయ విద్యా కేంద్రం విద్యార్థులు ప్రథమ, పాడేరు ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ద్వితీయ, శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతులు పొందారు. కొయ్యూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మల్లకంబ విన్యాసాలు, తలారిసింగి బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు విద్య ప్రాధాన్యతపై చేసిన స్కిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఆకట్టుకున్న శకటాలు, స్టాళ్లు

అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలు, ఏర్పాటు చేసిన స్టాళ్ల ఆకట్టుకున్నాయి. వ్యవసాయ, వైద్యారోగ్య, విద్య, డీఆర్‌డీఏ, పౌర సరఫరాలు, అగ్నిమాపక, తదితర శాఖలు శకటాలను ప్రదర్శించాయి. వ్యవసాయ, విద్య, వైద్య శాఖల శకటాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యాయి. జీసీసీ, వెలుగు, వ్యవసాయ, ఉద్యానవన, కాఫీ, ఐసీడీఎస్ శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి.

మహనీయుల ఆశ సాధనకు కృషి చేయాలి

- ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరురూరల్, జనవరి 26: ఎందరో సమరయోధులతో త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నామని, మరెందరో మేధావుల కృషి ఫలితంగా గణతంత్ర దేశంగా మారిందని, అటువంటి మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందన చేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, మల్లుదొర, బిర్సాముండ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటీడీఏ పరిధిలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులతో పలు కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, టీడబ్ల్యూ ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఈ అనుదీప్, ఎస్‌డీసీ వీవీఎస్.శర్మ, ఏవో ఎం.హేమలత, పీహెచ్‌వో ఎస్.అశోక్, ఏఏవో శ్రీనివాస్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, ఏపీవో పి.రాములు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఎస్పీ తుహిన్ సిన్హా, సబ్ కలెక్టర్ కార్యాలయలో సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.



ఐటీడీఏలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రాజెక్టు అధికారి అభిషేక్

చెరువులవేనం.. ప్రకృతి సోయగం



చెరువులవేనంలో మేఘాల అందాలు

లంబసింగి సమీపంలోని చెరువులవేనంలో శుక్రవారం మంచు, మేఘాల అందాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. కొండల దిగువున కొలువుదీరిన శ్వేత వర్ణ మేఘాలు చూపరులను ఆకట్టుకున్నాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సెలవు రోజు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. -చింతపల్లి

మన్యంలో స్థిరంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు

ముంచంగిపుట్టు, పెదబయలులో 11.9, జి.మాడుగులలో 13.1 డిగ్రీలు

పాడేరు/ చింతపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి తీవ్రత తగ్గడంలేదు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి.పొగమంచు దట్టంగా కురుస్తున్నది. శుక్రవారం ముంచంగిపుట్టు, పెదబయలులో 11.9, జి.మాడుగులలో 13.1, పాడేరులో 14, జీకేవీధిలో 14.1, అరకులోయలో 14.6, అనంతగిరిలో 15.6, చింతపల్లిలో 15.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి శీతగాలులు



పాడేరులో శుక్రవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు కూడా తగ్గని పొగమంచు ప్రభావం

వీస్తుండడంతో మన్యంలో చలి తీవ్రత కొనసాగుతున్నది. తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు దట్టంగా పొగ మంచు కమ్ముకుంటున్నది. దీంతో గిరిజనులు వీధుల్లో, ఇళ్ల వద్ద మంటలు వేసుకుని, ఉన్ని దుస్తులు ధరించి చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.



లంబసింగిలో కురుస్తున్న మంచు

విహారయాత్రలో విషాదం



పైలా అన్నపూర్ణాదేవి (ఫైల్ ఫొటో)

లోయలోకి దూసుకుపోయిన ఇన్నోవా

- సుంకరమెట్ట-కటిక రోడ్డులో బ్రేకులు ఫెయిల్ కావడంతో ప్రమాదం
- విశాఖకు చెందిన ఒక మహిళ మృతి, ముగ్గురికి గాయాలు
- కటిక జలపాతం సందర్శనకు వెళుతుండగా ఘటన
- అందరూ ఎస్ఆర్ షాపింగ్ మాల్ గోదాము ఉద్యోగులు



అరకులోయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వంశీ, రమేశ్



లోయలోకి దూసుకుపోయిన ఇన్నోవా కారు

విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. జిల్లాలోని అరకులోయ మండలం సుంకరమెట్ట నుంచి కటిక జలపాతానికి వెళ్లే రహదారిలో పర్యాటకులు ప్రయాణిస్తున్న వాహనం బ్రేకులు ఫెయిల్ కావడంతో లోయలోకి దూసుకుపోయింది. శుక్రవారం ఉదయం పదిన్నర గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. మరో ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. - మెయిన్ 3వ పేజీలో

ప్రయాణికులకు తిప్పలే

నేడు సగం ఆర్టీసీ బస్సులు వైసీపీ సభకు...

- సంగివలసలో ఉత్తరాంధ్ర సమన్వయ సదస్సు
- ఒక్కో నియోజకవర్గం నుంచి పది వేల మందిని తరలించాలని నేతలకు అధిష్ఠానం టార్గెట్లు
- ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు బలవంతంగా సేకరణ



నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం/ అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం/ పాడేరు రూరల్-ఆంధ్రజ్యోతి) వైసీపీ శనివారం భీమిలి నియోజకవర్గంలోని సంగివలస నుంచి ఎన్నికల శంఖారావం పూరిస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించే సభకు నియోజకవర్గానికి పది వేల మందిని తీసుకురావాలని ఎమ్మెల్యేలకు/ సమన్వయ కర్తలకు అధిష్ఠానం టార్గెట్లు విధించింది. ఇందుకోసం భారీగా ఆర్టీసీ బస్సులు తీసుకుంటోంది. విశాఖపట్నం రీజియన్‌లో మధురవాడ, వాల్తేరు, విశాఖపట్నం, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, స్టీల్ సిటీ డిపోలు ఉండగా మొత్తం 804 బస్సులు సిటీతో పాటు వివిధ రూట్లలో నడుస్తున్నాయి. వాటిలో 325 బస్సులను శనివారం సంగివలస సభ కోసం తీసుకున్నారు. అంటే సుమారు సగం బస్సులు శనివారం ప్రజలకు అందుబాటులో ఉండవు.

అనకాపల్లి డిపో నుంచి 45 బస్సులు...

అనకాపల్లి టౌన్, జనవరి 26: భీమిలి మండలం సంగివలసలో శనివారం జరిగే వైసీపీ బహిరంగ సభకు జనాలను తరలించడానికి అనకాపల్లి డిపో నుంచి 45 బస్సులను కేటాయించినట్టు అధికారులు పేర్కొన్నారు. డిపోలో మొత్తం 107 బస్సులు వుండగా వీటిల్లో 45 బస్సులను చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాలకు పంపినట్టు తెలిసింది. దీనిపై పీటీడీ అధికారులను వివరణ కోరగా, విశాఖ రీజియన్ మేనేజర్ ఆదేశాల మేరకు 45 బస్సులను శనివారం తెల్లవారుజామున వారు సూచించిన ప్రదేశాలకు పంపనున్నట్టు చెప్పారు. ఆయా బస్సులు తిరిగి రాత్రి ఎనిమిది గంటలకు డిపోకు చేరుకుంటామని వెల్లడించారు.

నర్సీపట్నం నుంచి 60 బస్సులు..

నర్సీపట్నం, జనవరి 26: భీమిలి మండలం సంగివలసలో జరిగే వైసీపీ బహిరంగ సభకు జనాన్ని తరలించడానికి నర్సీపట్నం పీటీడీ డిపో నుంచి 60 బస్సులు కేటాయించారు. డిపోలో పీటీడీ బస్సులు 77, అద్దె బస్సులు 27.. మొత్తం 104 బస్సులు ... మిగతా 7వ పేజీలో

నేడు సీఎం జగన్ రాక



విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 2.15 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మూడు గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి 3.05 గంటలకు హెలీకాప్టర్‌లో భీమిలి నియోజకవర్గ పరిధిలోని తగరపువలస సమీపానున్న సంగివలస వెళతారు. 3.30 గంటల నుంచి ఐదు గంటల వరకూ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయ సభలో పాల్గొంటారు. తిరిగి 5.10 గంటలకు హెలీకాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, 5.35 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారు.

ఘాట్‌లో మొరాయించిన ఆర్టీసీ బస్సు

- విశాఖ-సీలేరు నైట్ హాల్ట్ సర్వీసుకు లంబసింగి వద్ద సాంకేతిక సమస్య
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు
- రాత్రి 7.30 నుంచి 11.30 వరకు తీవ్రచలితో ఇబ్బంది పడిన ప్రయాణికులు
- విశాఖ-భద్రాచలం బస్సులో చింతపల్లికి.. అక్కడి నుంచి మరో బస్సులో సీలేరుకు చేరిక

సీలేరు, జనవరి 26: చింతపల్లి- సీలేరు మధ్య జీకే వీధి మండలంలో ఘాట్ రోడ్డులో ఆర్టీసీ అధికారులు కాలం చెల్లిన, సరైన కండిషన్‌లో లేని బస్సులను నడుపుతుండడంతో ఎక్కడ పడితే అక్కడ మొరాయిస్తున్నాయి. దీంతో మరో బస్సు వచ్చే వరకు లేదా ఆర్టీసీ అధికారులు వేరే బస్సులను పంపే వరకు ప్రయాణికులు గంటల తరబడి రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తున్నది. రాత్రిపూట అయితే ప్రయాణికులు ఇక్కట్లు వర్ణనాతీతం. తాజాగా గురువారం రాత్రి విశాఖపట్నం- సీలేరు నైట్ హాల్టు బస్సు సాంకేతిక సమస్య తలెత్తడంతో లంబసింగి ఘాట్‌లో ఆగిపోయింది. విశాఖపట్నంలో మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరిన ఈ బస్సు రాత్రి ఏడున్నర గంటలకు లంబసింగి చేరింది. ఇక్కడ సాంకేతిక లోపం (డబుల్ గేర్ పడి) తలెత్తడంతో మొరాయించింది. బస్సులో సీలేరు వెళ్లాల్సిన వారు 13 మంది, ధారకొండలో దిగాల్సిన వారు ఏడుగురు వున్నారు. మిగిలిన వారు చింతపల్లి, గూడెంకొత్తవీధికి చెందిన వారు చింతపల్లి, గూడెంకొత్తవీధికి చెందిన ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. సీలేరు, ధారకొండ ప్రయాణికులకు మరో మార్గం లేకపోవడంతో బస్సు వద్దనే వుండిపోయారు. కాగా సాంకేతిక సమస్యతో బస్సు ఆగిపోయిన విషయాన్ని పీటీడీ అధికారులకు తెలియపరిచారు. సాధారణంగా ఇటువంటి సమయాల్లో నర్సీపట్నం నుంచి బస్సును ... మిగతా 8వ పేజీలో



గురువారం రాత్రి లంబసింగి వద్ద సాంకేతిక లోపాలతో నిలిచిపోయిన విశాఖపట్నం- సీలేరు నైట్‌హాల్ట్ బస్, చలిలో ప్రయాణికులు

గణతంత్ర వేడుకల్లో అలరించిన ప్రదర్శనలు

ఉత్తమ సేవలు అందించిన అధికారులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం


అనకాపల్లిలో జాతీయ పతాకంతో నృత్యం చేస్తున్న బాలికలు


పోలీసు నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అనకాపల్లి కలెక్టర్, ఎస్పీ, అధికారులు


అనకాపల్లిలో ద్వితీయ బహుమతి సాధించిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శకటం



పాడేరు వేడుకల్లో ప్రదర్శిస్తున్న విద్యా శాఖ శకటం


పాడేరులో బీవీకే బాలికల దేశభక్తి ప్రదర్శన


గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న అనకాపల్లి జిల్లా అధికారులు


అనకాపల్లిలో తృతీయ బహుమతి సాధించిన విద్యా శాఖ శకటం


అనకాపల్లి వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ప్రదర్శన


అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న (ఎడమ నుంచి కుడివైపునకు) జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి, ఆర్డీవో చిన్నికృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, డ్వామా పీడీ సందీప్, డీపీవో ఆర్.శిరీషారాణి, డీఎఫ్‌వో జి.లక్ష్మణ్, డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, డీఏహెచ్‌వో డాక్టర్ బి.ప్రసాదరావు, డీఎస్‌డీవో టి.చాముండేశ్వరరావు, పీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్టీ రామకాసు

క్రైం... crime news

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన మహేంద్ర

గూడెంకొత్తవీధి, జనవరి 26: మండలంలోని మొండిగెడ్డ గ్రామ పంచాయతీలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొండెముల మహేంద్ర (22) శుక్రవారం ఉదయం స్నానం కోసం నీటిని వేడి చేసేందుకు బకెట్ నిండుగానున్న నీళ్ల వద్ద వాటర్ హీటర్ పెట్టుకున్నాడు. స్విచ్ ఆన్ చేసినప్పటికీ నీరు వేడి కావడంలేదని హీటర్ షాకెట్ వద్ద ఒత్తగా, ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో మహేంద్ర నిమిషాల వ్యవధిలోనే కింద పడిపోయి మృతి చెందాడు. అందొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బైక్ ఢీకొని బాలుడి మృతి

పెదబయలు, జనవరి 26: ద్విచక్ర వాహనం ఢీకొని ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పెదబయలు మండలంలోని బొండపల్లి పంచాయతీ తొట్టోడిపుట్టు గ్రామానికి చెందిన తల్లాబు నవీన్ కుమార్ (5) ఒకటో తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాల తరగతులు ముగిసిన తరువాత ఇంటికి చేరుకున్నాడు సాయంత్రం 5.30 గంటల సమయంలో గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన పిల్లలతో ఆడుకుంటున్నాడు. అదే సమయంలో గోమంగి పంచాయతీ కేంద్రానికి చెందిన కుంబిడి మహేష్, అతని తండ్రి కుంబిడి వెంకటరమణ ద్విచక్ర వాహనంపై వస్తూ బాలుడ్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాలుడు మృతదేహంపై పడి కుటుంబీకులకు భోరున విలపించారు. ప్రమాద ఘటన సమాచారం తెలియగానే పోలీసులకు గ్రామానికి చేరుకొని శుక్రవారం మృతదేహన్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

» జోన్‌లో 14 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం

విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడేళ్లకు పైబడి ఒకే జిల్లాలో పని చేస్తున్న ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్లను శుక్రవారం బదిలీ చేశారు. విశాఖపట్నం జోన్ (ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు) పరిధిలో 14 మందికి బదిలీలు అయ్యాయి. విశాఖ డిపో-2 పరిధిలో ఎక్సైజ్ సేల్స్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఐఏ బేగమ్‌ను విజయనగరం జిల్లా నెల్లిమర్ల డిపో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. అనకాపల్లి డిపోలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును శ్రీకాకుళం డిస్టిలరీ వింగ్‌కు బదిలీ చేశారు. డిపో-2 పరిధిలోని జెర్రిపోతులపాలెంలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి.మురళీధర్‌ను పార్వతీపురం మన్యం జిల్లాకు రిటైల్ మానిటరింగ్ అధికారిగా, అనకాపల్లి జిల్లాలో ఎక్సైజ్ సేల్స్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎం.ఇందుమతిని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా, విశాఖపట్నం డిపో-1 పరిధిలోని వెల్లంకిలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్‌ను విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎక్సైజ్ సేల్స్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్‌గా, నెల్లిమర్ల రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావును విశాఖపట్నం-2 డిపో ఎక్సైజ్ సేల్స్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా ఆఫీస్‌లో పనిచేస్తున్న సీహెచ్ చక్రవర్తిని విశాఖపట్నం రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా, శ్రీకాకుళంలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.సూర్యకుమారిని అనకాపల్లి రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్ పనిచేస్తున్న ఎస్వీ రమణమూర్తిని విశాఖపట్నం డిస్టిలరీ వింగ్‌కు, విజిలెన్స్ వింగ్‌లో పనిచేస్తున్న కేవైఎస్‌బీఆర్ కుమార్‌ను విశాఖపట్నం, విజయనగరం డిస్టిలరీ వింగ్‌కు, సంకిలి షుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పిన్నింటి శ్రీనివాసరావును విశాఖపట్నం-1 డిపో పరిధిలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. కోటపాడులోని పీఎంకే డిస్టిలరీస్‌లో పనిచేస్తున్న డి.శేషకుమారిని అనకాపల్లి డిపోకు, ఇచ్ఛాపురం సమీపాన పురుషోత్తపురం చెక్ పోస్టులో పనిచేస్తున్న కె.లక్ష్మిని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల డిపోకు, చిత్తూరు జిల్లా ఎంపీ డిస్టిలరీస్‌లో పనిచేస్తున్న కె.సునీతను శ్రీకాకుళం, విజయనగరం జిల్లా డిస్టిలరీ వింగ్‌కు బదిలీ చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

నేడు గవరపాలెం గౌరమ్మ జాతర

» ఏర్పాట్లు పూర్తి
» వీధివీధిన విద్యుత్ దీపాల అలంకరణలు
» భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు


గవరపాలెం గౌరీ పరమేశ్వరులు


అమ్మవారి గుడి వద్ద గౌరీ పరమేశ్వరుల విద్యుత్ సెట్టింగ్, రింగురోడ్డులో విద్యుత్ సెట్టింగ్

అనకాపల్లి టౌన్, జనవరి 26 : ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. వేకువజామున గౌరీ పరమేశ్వరులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. జాతరలో భాగంగా గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు అధికార, ప్రతిపక్ష నేతలను ఆహ్వానించినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్‌అప్పారావునాయుడు తెలిపారు. అలాగే ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా క్యూలైన్లను ఏర్పాటు చేశామన్నారు. జాతర సందర్భంగా సతకంపట్టులోని అమ్మవారి ఆలయాన్ని పూల, విద్యుత్ అలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. వీధి వీధిన భారీ ఎత్తున విద్యుత్ అలంకరణలు చేపట్టారు. చిననాలుగు రోడ్ల జంక్షన్ నుంచి వన్ వే జంక్షన్, రింగు రోడ్డు, బాలకృష్ణ బస్టాప్, గవరపాలెంలోని ప్రధాన జంక్షన్‌ల్లో భారీ ఎత్తున కోల్‌కత్తా వారి ట్రిక్ విద్యుత్ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులచే నేలవేషాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి సమయంలో సంతోషీమాత ఆలయ ముఖద్వారం వద్ద భారీ ఎత్తున బాణసంచా వెలిగించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కేఎస్ అప్పారావునాయుడు తెలిపారు. ఇదిలా ఉండగా వ్యాపారం, ఉద్యోగాల రీత్యా దూర ప్రాంతాల్లోని గవరపాలెం వాసులు గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి సొంతిళ్లకు చేరుకున్నారు. ఈ జాతరకు విశాఖ, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు ఖరగ్‌పూర్, బిలాయి, టాటా ప్రాంతాల్లో ఉన్న వారు కూడా వారి బంధువుల ఇళ్లకు వస్తున్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీస్ పికెట్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు సీఐ శంకరరావు తెలిపారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

» పరవాడ స్టేషన్‌లో పనిచేస్తున్న సన్యాసిదొర
» స్వగ్రామం పెదబయలు మండలం మండిబ వెళ్లి వస్తుండగా మాడుగుల ఘాట్ రోడ్డుకు చేరేసరికి ఛాతీనొప్పి
» ఆస్పత్రిలో చేరిక.. కాసేపటికే కన్నుమూత


సన్యాసిదొర (ఫైల్)

మాడుగుల, జనవరి 26: పరవాడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అల్లూరి సీతారామురాజు జిల్లా పెదబయలు మండలం మండిబ (లువ్వాసింగి) గ్రామానికి చెందిన కె.సన్యాసిదొర (39) పరవాడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. స్వగ్రామం లువ్వాసింగికి సెలవుపై వెళ్లిన ఆయన, తిరిగి విధుల్లో చేరేందుకు శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. మాడుగుల ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చేరుకునేసరికి ఛాతీనొప్పి రావడంతో మాడుగుల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సహాయంతో ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. డాక్టర్ శ్రీలక్ష్మి వైద్య సేవలు అందించారు. కొంత సేపు కోలుకున్నప్పటికీ ఉన్నఫళంగా ఒక్కసారిగా సన్యాసిదొర కుప్పకూలిపోయారు. దీంతో ఎస్ఐ దామోదరనాయుడు సిబ్బందితో కలిసి ప్రైవేటు అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. అంతకుముందు పరవాడ సీఐ ఆస్పత్రికి చేరుకుని మృతుని బంధువులను పరామర్శించారు.

నేత్ర పర్వంగా శ్రీనివాసుని కల్యాణం


శ్రీనివాసుని కల్యాణం జరుగుతున్న దృశ్యం

అచ్యుతాపురం, జనవరి 26: పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. శుక్రవారం ఉదయం వేదపండితులు విశ్వక్షేణ పూజతో ప్రారంభించారు. అనంతరం, శ్రీరామ రక్ష స్తోత్రం, లక్ష్మీసహిత విష్ణు సహస్రనామ స్తోత్రం తదుపరి పద్మావతి సహిత శ్రీనివాసుని కల్యాణాన్ని నిర్వహించారు. ఈకళ్యాణంలో 400 జంటలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు జరిగాయి. అనంతరం అన్న సమారాధన జరిగింది. వికాస తరంగిణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, రాష్ట్ర గవర కార్పొరేషన్ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సరిసా శ్రీనివాసరావుతో పాటు భక్తులు భారీ స్థాయిలో పాల్గొన్నారు. కల్యాణానికి బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

అనకాపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో చక్కని ప్రతిభను కనబరిచిన అధికారులకు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. జిల్లాలోని 632 మందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందించారు.

జిల్లా అధికారులు: బి. దయానిధి (డీఆర్‌వో), ఏజీ చిన్నికృష్ణ (ఆర్డీవో), జి. రామారావు (గణంకాల వివరాలు అధికారి), డాక్టర్ ఎ.హేమంత్ (డీఎంహెచ్‌వో), ఈ.సందీప్ (పీడీ, డ్వామా), సీహెచ్. ఎస్ఆర్ఎస్వీ రమేష్ (ఈఈ, ఆర్అండ్‌బి), ఎస్. గోపాలరాజా (జిల్లా సర్వేయర్), ఆర్.శిరీషారాణి (డీపీవో), వీఎల్ సుభాషిణి (జిల్లా ఖజానాధికారిణి), జి.లక్ష్మణ్ (డీఎఫ్‌వో), కె.రమామణి (ఎస్‌డీసీ), ఎస్.మంజులావాణి (జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారిణి), డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు(డీసీహెచ్ఎస్), కె.శచీదేవి (పీడీ డీఆర్‌డీఏ), జీవీబీ జగదీష్ (ఏడీ,డబ్ల్యూడీఏటీజీఎస్‌సీ), బి.మోహనరావు (జిల్లా వ్యవసాయాధికారి), డాక్టర్ బి.ప్రసాదరావు (డీఏహెచ్‌వో), పీఎస్ఎల్ కిరణ్‌కుమారి(డీసీవో), బి.రవికిరణ్ (డీఏటీఎంఓ), ఇ.నాగలక్ష్మి (డీటీ కో-ఆర్డినేటర్),ఎం.వెంకటలక్ష్మమ్మ (డీఈవో), ఎన్వీ రమణ (డీపీఅండ్ఈవో), ఆర్వీ రమణ (డీడీఆర్ అండ్ ఎఫ్‌వో), పి. ప్రసాద్ (డీడీ మత్స్యశాఖ), జి. ప్రభాకర్‌రావు (ఉద్యానవనశాఖ), కె.ఇంద్రావతి (డీఐపీఆర్‌వో), జీఎం శ్రీధర్ (జీఎం డీఐసీ), కె.సత్యనారాయణ (ఎల్‌డీఎం), చాముండేశ్వరరావు (డీఎస్‌డీవో), సబ్బవరపు త్రినాథరామ కాసు (వీఆర్ఓల సంఘ అధ్యక్షుడు)

కలెక్టరేట్ : ఎ. శ్రీనివాసరావు (సూపరింటెండెంట్), ఎంఎ శ్రీనివాస్ (సూపరింటెండెంట్), వైఎస్వీవీ ప్రసాదరావు (ఓఎస్‌డీ, రీసర్వే), సీహెచ్. చంద్రశేఖర్ (సూపరింటెండెంట్, స్పందన), ఆర్.నరసింహమూర్తి (సూపరింటెండెంట్, ల్యాండ్స్), పి.లక్ష్మీదేవి (సూపరింటెండెంట్, కో-ఆర్డినేషన్)

తహసీల్దార్లు, డీటీలు : వీవీఎల్ఎస్ గంగాధరరావు (అనకాపల్లి), బి. సత్యనారాయణరావు (సబ్బవరం)

పోలీస్ శాఖ : అదిరాజ్‌సింగ్ రాణా (ఏఎస్పీ, నర్సీపట్నం), వి.సుబ్బరాజు (డీఎస్పీ, అనకాపల్లి), కేవీ సత్యనారాయణ (డీఎస్పీ, పరవాడ), ఎం. మహేశ్వరరావు (డీఎస్పీ, దిశ), పి. శ్రీనివాసరావు (డీఎస్పీ, డీటీసీ), కె.కుమారస్వామి (సీఐ సోషల్‌మీడియా), ఎస్. లక్ష్మణమూర్తి (సీఐ డీసీఆర్‌బీ), పి.అప్పలరాజు (సీఐ, పాయకరావుపేట), ఆర్. నీలయ్య (సీఐ,సీసీఎస్), కె.అప్పలనాయుడు (సీఐ, డీఎస్‌బీ-2), టీవీ రమణ (డీపీఓ కార్యాలయం)

వ్యవసాయ శాఖ : బి.సరోజిని (వ్యవసాయాధికారి, పాయకరావుపేట), ఎం. వాసుదేవరావు (వ్యవసాయాధికారి, నర్సీపట్నం), డీవీ రమణ (సూపరింటెండెంట్, జిల్లా ఆఫీస్), టీవీఆర్ఎల్ నారాయణ (సీనియర్ అసిస్టెంట్, ఎలమంచిలి)

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా): బీవీ శ్రీనివాసకుమార్ (ఏపీడీ, ఎలమంచిలి), జె.మణికుమార్ (ఏపీడీ, అనకాపల్లి)

జిల్లా పౌరసరఫరాల శాఖ : టి. లీలా శేషకుమారి (డీటీ), కె.ఈశ్వరరావు (సీఎస్ఆర్ఐ, మాడుగుల), జి. సాయిబాబు (సీఎస్ఆర్ఐ, కె. కోటపాడు)

కమర్షియల్ ట్యాక్స్: పీవీ శైలజా (అసిస్టెంట్ కమిషనర్, అనకాపల్లి), ఏ. తరుణ్ (అసిస్టెంట్ కమిషనర్, అనకాపల్లి), ఎన్. సౌజన్య (గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అధికారి, అనకాపల్లి), జి. సంతోషమ్మ (అసిస్టెంట్ కమిషనర్, అనకాపల్లి).

జిల్లా పరిషత్: కె.అప్పలనాయుడు (ఎంపీడీఓ ఎలమంచిలి), సీహెచ్ సుబ్బలక్ష్మి, (ఎంపీడీఓ, దేవరాపల్లి), బీహెచ్‌వీఆర్ రమణబాబు, (ఎంపీడీఓ, అనకాపల్లి), బి.అమ్మాజి (ఏఓ చోడవరం), జిల్లా ఖజానా కార్యాలయం నుంచి సాయిఅఖిలేష్, జె.రత్నాలు, పింశకర్, సయ్యద్ సలీమ్, డీవీ రమారెడ్డి (ఏపీఈపీడీసీఎల్)

909 మద్యం బాటిళ్లు స్వాధీనం


మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ అధికారులు

అనకాపల్లి టౌన్, జనవరి 26: స్థానిక మిరియాలకాలనీ మూడో వీధిలోని ఒక ఇంటిపై శుక్రవారం దాడి చేసి అనధికారికంగా నిల్వ చేసిన 909 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఇంటి యజమాని గాని, సరుకుకు సంబంధించిన వ్యక్తులు గాని ఎవరన్నది తెలియాల్సి ఉందన్నారు. చుట్టుపక్కల వారిని ఎవరిని అడిగినా ఎటువంటి సమాచారం అందడం లేదన్నారు. ఈపీడీసీఎల్, రిజిస్టర్ ఆఫీస్ ద్వారా ఆ ఇంటి వివరాలను తెలుసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విచారణ నిర్వహించి, సరుకు నిల్వ చేసిఇన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

ప్రయాణికులకు తిప్పలే

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. పీటీడీకి చెందిన 77 బస్సుల్లో 60 బస్సులు సీఎం సభకు ప్రజలను తరలించడానికి వివిధ నియోజకవర్గాలకు పంపుతున్నారు. విశాఖ, చింతపల్లి, చోడవరం రూట్లలో నడిచే బస్సులన్నింటినీ మళ్లిస్తున్నారు. మిగిలిన 17 పీటీడీ బస్సులు, 27 అద్దె బస్సులు మాత్రమే ప్రయాణికులకు అందుబాటులో వుంటాయి. సాధారణంగా ప్రతీ శనివారం మధ్యాహ్నం తరువాత ఆర్టీసీ బస్సుల్లో రద్దీ వుంటుంది. ఆదివారం సెలవు కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు సొంతూళ్లకు వెళుతుంటారు. ఈసారి వైసీపీ సభకు సగానికిపైగా బస్సులు కేటాయించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు. దీనిపై డిపో మేనేజర్ ధీరజ్‌ని వివరణ కోరగా ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చూస్తామన్నారు.

పాడేరు డిపో నుంచి సగం బస్సులు

పాడేరు రూరల్: పాడేరు పీటీడీ డిపోలో 45 బస్సులు వుండగా, 22 బస్సులను సీఎం సభకు కేటాయించామని డీపీటీవో వి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం సభకు జనాలను తరలించేందుకు ప్రతి మండలానికి రెండు బస్సులు పంపుతున్నట్టు చెప్పారు. అందువల్ల శనివారం పలు రూట్లలో బస్సు సర్వీసులను రద్దు చేశామన్నారు. 5 గంటలకు అరకు, 5.30 గంటలకు గూడెం, మూలకొత్తూరు, జోలాపుట్టు, 6 గంటలకు మంప, అరడగూడెం, 6.15 గంటలకు అరకు, కుమడ, 6.30 గంటలకు చోడవరం, అరకు, 6.45 గంటలకు డుడుమ, పెదగూడ, వేంగడ, 7.15 గంటలకు చింతపల్లి, 7.30 గంటలకు మద్దిగరువు, 7.45 గంటలకు బాకూరు, 8 గంటలకు అరకు, 8.30 గంటలకు చోడవరం, 10.15 గంటలకు జోలాపుట్టు, 11 గంటలకు గూడెం, 12.30 గంటలకు గెమ్మెలి బస్సు సర్వీసులను రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రైవేటు బస్సులు కూడా..

సంగివలస సభకు జనం తరలింపునకు వైసీపీ నేతలు ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను కూడా బలవంతంగా తీసుకున్నారు. బస్సులు తీసుకున్నామని చెప్పి..విద్యా సంస్థలకు సెలవు ఇచ్చేసి, పార్టీకి చెడ్డపేరు తెస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. బస్సులు లేకపోయినా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలని, సెలవు మాత్రం ఇవ్వకూడదని స్పష్టంచేశాయి.

నాడు టీడీపీకి మొండిచేయి

గత నెలలో తెలుగుదేశం పార్టీ భోగాపురం మండలం పోలిపల్లిలో 'యువగళం..నవశకం' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించింది. దీనికి రాష్ట్రం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు వచ్చారు. ఈ సభ కోసం బస్సులు కావాలని ఆర్టీసీ ఎండీకి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు లేఖ రాస్తే, ముందు అంగీకరించి, తరువాత ఇవ్వలేమని చేతులెత్తేశారు. ప్రైవేటు సంస్థల నుంచి సమీకరించుకోవాలని ప్రయత్నిస్తే... ఆయా యాజమాన్యాలను బెదిరించారు. బస్సులు ఇస్తే ఊరుకోబోమని హెచ్చరించడంతో టీడీపీ శ్రేణులు సొంత కార్లు, ఆటోలు, బైకులపై సభకు వెళ్లారు. సాధారణ ప్రజలకు ఇబ్బంది కలుగుతుందనే బస్సులు ఇవ్వలేదని నాడు అధికారులు చెప్పుకొచ్చారు. ఇప్పుడు సగం బస్సులను వైసీపీ సభకు ఇవ్వడం ఇబ్బంది కలగవా?..అని తెలుగుదేశం వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.


పాడేరు పంచాయతీ కేంద్రంలో జెండా ఆవిష్కరిస్తున్న సర్పంచ్ ఉషారాణి


చింతపల్లిలో జెండా ఎగురవేస్తున్న ఎంపీడీవో ఆశాజ్యోతి



అరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న అధికారులు


హుకుంపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఎగరవేస్తున్న దృశ్యం

మన్యంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో జాతీయ జెండా ఆవిష్కరణ


పాడేరు: గణతంత్ర వేడుకల్లో సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, అధికారులు

పాడేరు రూరల్, జనవరి 26: మన్యంలో శుక్రవారం వాడవాడలా గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు జెండా వందనం చేశారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి.

పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయలో సబ్ కలెక్టర్ దాత్రిరెడ్డి పతాకావిష్కరణ చేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వంజంగి త్రినాథరావునాయుడు, పోలీస్ స్టేషన్‌లో సీఐ డి.నవీన్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.సాయినవీన్, ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో ఎస్.రామచందరరావు పతాకావిష్కరణ చేశారు. పాడేరు మేజర్ పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, వి.పిన్నయ్యదొర, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. జీసీసీ డీఎం కార్యాలయం వద్ద డీఎం సింహాచలం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ సిహెచ్.రమాదేవి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం విశ్వప్రసాద్, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీవో వి.ఝాన్సీ పతాకావిష్కరణలు చేశారు.


ముంచంగిపుట్టులో జాతీయ జెండాను ఎగరవేస్తున్న దృశ్యం

చింతపల్లి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గణతంత్ర వేడుకులను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రథమ శ్రేణి జుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎస్.మధుసూదన్, అటవీశాఖ డివిజనల్ కార్యాలయంలో డీఎఫ్‌వో సిహెచ్.సూర్యనారాయణ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్, ఉద్యాన పరిశోధన స్థానంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్, జీసీసీ కార్యాలయంలో డీఎం పి.దేవరాజు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.ఆశాజ్యోతి, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ లత్సాపాత్రుడు, పోలీసు స్టేషన్‌లో సీఐ


డుంబ్రిగుడలో జెండా వందనం చేస్తున్న ఎంపీడీవో ఉషారాణి, అధికారులు

కె.రమేశ్, ఏరియా ఆస్పత్రిలో స్త్రీ వైద్యనిపుణులు డాక్టర్ సుధాశారద, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో బీవి రమణ, మేజర్ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఏపీఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రామేశ్వరం, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు మువ్వన్నెల జెండాను ఎరగవేశారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యతను వక్తలు వివరించారు. ఈ వేడుకల్లో ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, వైసీపీ మండల అధ్యక్షుడు మోరీ రవి, ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి పద్మ, కోఆప్టెడ్ సభ్యుడు నాజర్‌వల్లి, ఎంఈవో-1, 2 వనసల ప్రసాద్, బోడంనాయుడు, ఏవో రవీంద్రనాథ్, ఎస్ఐ అరుణ్ కిరణ్, అటవీశాఖ రేంజ్ అధికారులు పాత్రుడు, జగదీశ్వరరావు, న్యాయస్థానం సూపరింటెండెంట్ జోగారావు, హెచ్‌డబ్ల్యూవోలు పసుపులేటి వినాయకరావు, నూకరత్నం, గణేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ: మండలంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, కళాశాలలు, పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎం జాతీయ జెండాను ఎగుర వేశారు. రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దార్ వేణుగోపాల్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వెంకటేష్, పోలీసు సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ రుద్రశేఖర్, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. కాగా, గణంత్ర వేడుకల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

కొయ్యూరు: మండల వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లాలం సీతయ్య, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ తిరుమలరావు, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, జీసీసీ బ్రాంచ్ కార్యాలయంలో బీఎం, పోలీసు స్టేషన్లలో ఎస్ఐలు, సచివాలయాలల్లో కార్యదర్శులు, విద్యాలయాల్లో హెచ్‌ఎంలు జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యతను వారు వివరించారు. కార్యక్రమాలలో ఎంఈవో రాంబాబు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్ఎల్‌వీ ప్రసాద్, పోలీసు స్టేషన్‌లో సీఐ అశోక్‌కుమార్, ఈఎంఆర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎంవీ రమణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు గణతంత్ర దినోత్సవం చరిత్రను వివరించారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీ కుమారస్వామి, ఎస్ఐ అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.



గూడెంకొత్తవీధి, సీలేరులో జెండా వందనం చేస్తున్న పోలీసులు


కొయ్యూరులో జెండా వందనం చేస్తున్న ఎంపీడీవో సీతయ్య, అధికారులు

సీలేరు: సీలేరు పోలీసు స్టేషన్, ఏపీ జెన్‌కో ఎస్ఈ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జడ్పీ ఉన్నత పాఠశాల, డీఏవీ పాఠశాల, సీలేరు కాన్వెంట్, బాలుర గురుకుల పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయం వద్ద జాతీయ పతాకాలను ఎగురవేసి గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఏవీ పాఠశాల వద్ద విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముంచంగిపుట్టు: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పోలీస్ స్టేషన్, సీఆర్‌పీఎఫ్ బేస్‌క్యాంప్‌లలో జాతీయ జెండాను ఎగరవేశారు. మంచంగిపుట్టు శారదానికేతన్ పాఠశాల విద్యార్థులు భరతమాతతో పాటు పలువురు స్వతంత్ర సమరయోధుల వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ నర్సమ్మ, వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉషారాణి, రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ నాగమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు స్టేషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో గణతంత్ర వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, పంచాయతీ కేంద్రాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జడ్పీటీసీ సభ్యుడు మత్యలింగం విద్యార్థులతో కలిసి గణతంత్ర వేడుకలు నిర్వహించారు. అలాగే రెవెన్యూ కార్యాలయం, పోలీసు స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, గ్రామ సచివాలయాల వద్ద మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, డీటీ క్రిష్ణారావు, ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు, ఎంఈవో ఈశ్వరరావు, డాక్టర్ గాయత్రి, సామ్య, ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

జిల్లాలో 331 అధికారులకు ప్రశంసాపత్రాలు

» కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా అందుకున్న అధికారులు, ఉద్యోగులు

పాడేరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 331 మంది అధికారులు, ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రశంసాపత్రాలను అందించారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఎనిమిది మంది ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయంలోని 15 మంది, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని ఏడుగురు, చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఐదుగురు, పాడేరు ఐటీడీఏలోని ఎనిమిది మంది, రంపచోడవరం ఐటీడీఏలోని నలుగురు, చింతూరు ఐటీడీఏలోని ముగ్గురు, పోలీసు శాఖలోని 46 మందికి, పంచాయతీరాజ్ శాఖ, సచివాలయాల సిబ్బంది 33 మందికి, వైద్యారోగ్య శాఖలో 15 మంది, పాడేరు గిరిజన సంక్షేమ విద్యాశాఖలో ఐదుగురు, రంపచోడవరం గిరిజన సంక్షేమ విద్యా శాఖలో ముగ్గురు, చింతూరు గిరిజన సంక్షేమ విద్యాశాఖలో ఇద్దరు, ఇంటెలిజెన్స్, ఎస్ఈబీలో నలుగురు, సమాచార శాఖలో ఒకరు, ప్రజా రవాణా శాఖలో 29 మందికి, ఉద్యానవన శాఖలో ముగ్గురు, రవాణా శాఖలో ఇద్దరు, డ్వామాలో ఏడుగురు, సర్వే విభాగంలో నలుగురు, ఖజానా శాఖలో ముగ్గురు, ఐసీడీఎస్‌లో ఐదుగురు, టూరిజం, గణాంక, శాఖలో తొమ్మిది మంది, అగ్నిమాపక శాఖలో ఐదుగురు, అటవీశాఖలో పది మంది, డీఆర్‌డీఏలో ఎనిమిది, పట్టుపరిశ్రమలో ఒకరు, పౌరసరఫరాల శాఖలో నలుగురు, గ్రామీణా నీటి సరఫరా విభాగంలో నలుగురు విద్యాశాఖలో ఎనిమిది మంది, వ్యవసాయశాఖలో ఏడుగురు, ఆర్‌అండ్‌బీలో నలుగురు, పంచాయతీరాజ్‌శాఖలో ఇద్దరు, ఏడుగురు బ్యాంకు అధికారులు, ముగ్గురు స్వచ్ఛంద సేవకులు, విద్యుత్ శాఖలో ఏడుగురు, హౌసింగ్‌లో ముగ్గురు, రెడ్ క్రాస్ సొసైటీలో ఇద్దరు, కార్మిక శాఖలో ఇద్దరు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తిక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గిరి విద్యార్థుల మరణాలపై నిర్లక్ష్యం తగదు'



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రాజశేఖర్

పాడేరు రూరల్, జనవరి 26: అల్లూరి జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలపై ఐటీడీఏ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించే గిరిజన విద్యార్థినీ విద్యార్థులు అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నా ఐటీడీఏ అధికారులు సమగ్ర విచారణ చేపట్టక పోవడం దారుణమన్నారు. ఈ కారణంగానే వసతి గృహాల నిర్వాహకులలో నిర్లక్ష్యం పెరుగుతుందని విమర్శించారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్‌లను నియమించాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నా ఐటీడీఏ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి గిరిజన సంక్షేమ ఆశ్రమాల్లో సౌకర్యాలను మెరుగుపర్చి విద్యార్థుల ఆరోగ్య రక్షణకు హెల్త్ వలంటీర్లను ఏర్పాటు చేయాలని, ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించాలని, అనారోగ్యంతో మరణించే విద్యార్థుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.చిన్నబాబు, అనీల్, ఆమోష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే జగన్ స్వరం మారింది

» టీడీపీ అరకులోయ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, జనవరి 26: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఓటమి తప్పదని గుర్తించి, ముందే సంతోషంగా దిగిపోతానని స్వరం మార్చారని టీడీపీ అరకులోయ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర అన్నారు. అరకులోయలోని తన స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2021లో నన్నెవరూ ఏమీ చెయ్యలేరని చెప్పిన జగన్, 2022లో నన్నే నమ్మండని, 2023లో మిమ్మల్నే నమ్ముకున్నానని పలికి, తాజాగా 2024లో సంతోషంగా దిగిపోతానని డ్రామాలు, కట్టుకథలు అల్లుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను ఊహించే ముందుగానే దిగిపోతానంటూ జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రజా ధనాన్ని, ప్రజలను దోచుకుని దాదాపు నాలుగు లక్షల కోట్లు తిన్నారని ఆరోపించారు. ఇంత పెద్ద మొత్తంలో తిన్న జగన్‌మోహన్‌రెడ్డికి ఇక పదవి తో పనిలేదని, దోచుకున్న మొత్తాన్ని సర్దుబాటుచేసుకునేందుకు దిగిపోతానని అంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అప్పులమయం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజా వ్యతిరేక పాలనను అంతా గుర్తించి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం- జనసేన కూటమిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అర్మ మాజీ సర్పంచ్ పాంగి సుబ్బారావు, పెదలబుడు ఉప సర్పంచ్ చందూ విజయనిర్మల, వార్డు సభ్యులు త్రినాథ్, మాజీ ఎంపీటీసీ వెంకట్రావు, టీడీపీ సీనియర్ నాయకులు రాజారావు, భీమన్న, మోహన్, చిరంజీవి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర

బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం..

» భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం

పాడేరు రూరల్, జనవరి 26: మతతత్వ బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పాడేరులో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనతరం మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి, ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తుందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి ప్రజల నెత్తిన భారం మోపడమే కాకుండా వ్యవసాయ పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నిందని మండిపడ్డారు. దేశ సంపదను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా దోచుపెడుతుందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు అన్నివర్గాల ప్రజలు ఏకం కావాల ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, అనంతగిరి జడ్పీటీసీ డి.గంగరాజు, గిరిజన సంఘం నాయకులు బాలదేవ్, ధర్మన్నపడాల్, ధనుంజయ్, సన్నిబాబు, సుందరరావు, త్రినాథ్, మోసయ్య, రామారావు, శ్రీను పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వంజంగి హిల్స్‌పై త్రివర్ణ పతాకం రెపరెపలు

గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ప్రముఖ సందర్శనీయ ప్రదేశం వంజంగి మేఘాల కొండపై గిరిజన యువకులు జాతీయ జెండాను ఎగురవేశారు. మంచు మేఘాల చెంతన ఎత్తయిన కొండపై మువ్వన్నె జెండా రెపరెపలాడుతున్న దృశ్యాన్ని తిలకించిన వారంతా ఆనందం వ్యక్తం చేశారు. -పాడేరు/ఆంధ్రజ్యోతి



టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఎస్సీ కాలనీల్లో సదుపాయాలు

» పార్టీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

చింతపల్లి, జనవరి 26: ఎస్సీ కాలనీల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కనీస సదుపాయాలు కల్పించడం జరిగిందని పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం నిర్వహించే టీడీపీ బహిరంగ సమావేశం ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచి నీటి పథకం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పక్కా గృహాలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ, 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడం వల్ల కార్యరూపం దాల్చలేదన్నారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఎస్సీ కాలనీపై పాలకులు, అధికారులు కన్నెత్తి చూడలేదన్నారు. దీంతో అభివృద్ధి కుంటుబడిపోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే గిరిజనులతో పాటు ఎస్సీల నివాస గ్రామాలు, కాలనీలు అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్టు చెప్పారు. కాలనీలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.బేతాళుడు, రీమల ఆనందరావు, సోమేశ్, చింతాడ చిన్న పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ సభను జయప్రదం చేయండి

డుంబ్రిగుడ, జనవరి 26: రాజమండ్రిలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 28న ఓట్‌ఫర్ ఓపీఎస్ నినాదంతో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు రాజారావు, కార్యదర్శి బాలక్రిష్ణ కోరారు. రానున్న ఎన్నికల్లో భాగంగా సీపీఎస్ రద్దు అంశాన్ని ప్రధాన అంశంగా రాజకీయ పార్టీలు చేర్చాలని డిమాండ్ చేశారు. వారి వెంట సంఘం నేతలు బాబ్జీ, మేఘనాథ్ ఉన్నారు.

ఘాట్‌లో మొరాయించిన ఆర్టీసీ బస్సు

... 5వ పేజీ తరువాయి

పంపుతుంటారు. కానీ గురువారం రాత్రి అటువంటి ఏర్పాట్లు చేయలేదు. ఎట్టకేలకు రాత్రి 11.30 గంటలకు విశాఖ నుంచి భద్రాచలం వెళ్లే బస్సు లంబసింగి వచ్చింది. సీలేరు, ధారకొండలకు చెందిన ప్రయాణికులను ఈ బస్సులో ఎక్కించి చింతపల్లి వరకు పంపారు. తరువాత చింతపల్లి నైట్ హాల్టుగా ఉన్న నర్సీపట్నం డిపో బస్సులోకి వీరిని ఎక్కించి సీలేరు పంపించారు. రాత్రి 11.30 గంటలకు సీలేరు చేరాల్సిన ప్రయాణికులు శుక్రవారం తెల్లవారుజామున మూడున్నర గంటలకు చేరుకున్నారు. కాగా ఏజెన్సీలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే లంబసింగి ప్రాంతంలో అర్థరాత్రి వరకు గడ్డకట్టే చలితో తీవ్ర ఇబ్బందులు పడ్డామని ప్రయాణికులు వాపోయారు.


జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న (కుడి నుంచి ఎడమ వైపునకు) డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, టీడబ్ల్యూ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం.రాజు, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, ఈపీడీసీఎల్ ఈఈ బీవీవీ.రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయం డీఎం భాస్కరరావు, పాడేరు ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, అనంతగిరి ఎంపీడీవో వి.నగేశ్, హుకుంపేట జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కె.సింహాచలంనాయుడు, ధారకొండ పీహెచ్‌సీ డాక్టర్ హిమబిందు, జిల్లా ఫార్మసిస్టు ఎస్.సంజీవరాజు, ఆర్టీసీ సూపరింటెండెంట్ డి.శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి వెంకటరమణ